వనాల నిర్వహణ పకడ్బందీగా..

- పల్లెప్రకృతి వనాల సంరక్షణకు కొత్త నిబంధనలు
- పీపీవీ (పల్లెప్రకృతి వనం) యాప్‌తో పర్యవేక్షించాలని ప్రభుత్వం ఆదేశాలు

పెన్‌పహాడ్ : గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనం పెంచాలనే లక్ష్యంగా ప్రతి పంచాయతీ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేసింది. ఈ పల్లెప్రకృతి వనాల (పీపీవీ) పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులకు అప్పగించింది. దీనికితోడు ఇటీవల ప్రభుత్వం ప్రకృతి వనాల నిర్వహణకు కొత్త నిబంధనలు అమలులోకి తెచ్చింది. పల్లెప్రకృతి వనం (పీపీవీ) వివరాలను రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా ఆన్‌లైన్ ద్వారా తెలుసుకునేందుకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. గ్రామంలోని పల్లెప్రకృతి వనంలో ఐదు రకాల ఫొటోలు తీసి ఈ ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. పల్లెప్రకృతి వనంలో నాటిన మొక్కల వివరాలు, బతికిన, చనిపోయిన మొక్కల వివరాలు,


అనంతారంలోని పల్లెప్రకృతి వనం

వాటికి వెచ్చించిన ఖర్చుల వివరాలను యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఇక నుంచి ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులే ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టి పనుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు.

29 పంచాయతీల్లో..

పెన్‌పహాడ్ మండలంలో 29గ్రామపంచాయతీలు ఉండగా.. అన్ని గ్రామాల్లోనూ పల్లెప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. ఒక ఎకరా విస్తీర్ణంలో 4వేల మొక్కలు, 0.75ఎకరాల విస్తీర్ణంలో 3వేల మొక్కలు, 0.50ఎకరాల విస్తీర్ణంలో 2వేల మొక్కలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఇప్పటి వరకు సుమారు లక్ష 42వేల 61మొక్కలు నాటారు. దీంతో పాటు మండలానికి రెండు చొప్పున బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వీటిని 5నుంచి 10ఎకరాల విస్తీర్ణంలో 15వేల నుంచి 31వేల మొక్కలు పెంచడానికి ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది.

ప్రభుత్వ ఆదేశాల మేరకు..



జాతీయ ఉపాధిహామీ పథకంలోని నిబంధనల ప్రకారం ఇప్పటి వరకు పల్లె ప్రకృతి వనాలను గ్రామపంచాయతీలు నిర్వహించాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇక నుంచి వాటి నిర్వహణ బాధ్యత పంచాయతీ కార్యదర్శులే చూసుకోవాలి.

- బాణాల శ్రీనివాస్, ఎంపీడీఓ

15నుంచి గ్రామాల్లో బీజేపీ సమావేశాలు

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు


మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

ఆత్మకూర్ (ఎస్) : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గ్రామ గ్రామాన శక్తి కేంద్రాల ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి సమావేశాలు నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరావు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌ల మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లో సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై కార్నర్ మీటింగ్‌లలో ప్రజలకు వివరించాలన్నారు. 2014 తర్వాత రాష్ట్ర ప్రభుత్వం 25 లక్షల మందికి రేషన్ కార్డులు ఇవ్వాల్సి ఉండగా ఇవ్వలేదని తెలిపారు. దీంతో వారంతా కేంద్ర ప్రభుత్వం అందించే ఉజ్వల్ గ్యాస్‌కు అర్హులు కాకుండా పోయారన్నారు. ఫసల్ బీమా పథకంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రీమియం చెల్లించకపోవడంతో రాష్ట్ర రైతాంగం నష్టపోతుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌కు ఎన్నికల సమయంలోనే డబుల్‌బెడ్ రూం, దళిత బంధు, రుణమాఫీ, యాదవులకు గొర్లు గుర్తుకొస్తాయన్నారు. గత మూడేళ్లుగా కేంద్రం ఉచితంగా రేషన్ బియ్యం అందజేస్తోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 12 సంక్షేమ పథకాలను ప్రజలకోసం ప్రవేశపెట్టగా రాష్ట్ర ప్రభుత్వం వాటిని ప్రజల్లోకి తీసుకువెళ్లడంలేదని తెలిపారు. మండలంలో 28 సభలను 14 మంది శక్తి కేంద్ర ఇన్‌చార్జ్‌లు నిర్వహించాలని తెలిపారు. నియోజకవర్గంలో ప్రతి నెలా 15 రోజులు ప్రజా సమస్యలపై సందర్శించి వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పందిరి రాంరెడ్డి, కాప రవి, సంధ్యాల సైదులు, పాటి కరుణాకర్‌రెడ్డి, దండా వెంకటరెడ్డి, పందిరి మాధవరెడ్డి, యాదగిరి, నవిలె లింగరాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వికలాంగులను విస్మరించిన కేంద్ర ప్రభుత్వం

భానుపురి : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దివ్యాంగులను విస్మరించిందని టీఆర్‌వీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నయీం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది బడ్జెట్‌లో వికలాంగులకు కేటాయింపులు ఒకశాతం మాత్రమే పెరిగాయని తెలిపారు. బడ్జెట్‌లో వికలాంగులకు నిధుల కేటాయింపులో నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ రేపు వికలాంగుల సంఘాలు బడ్జెట్ పత్రాలను దహనం చేయాలని పిలుపునిచ్చారు.

గీత కార్మికులకు లైసెన్సులు ఇవ్వాలి


కంఠమహేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ప్రసాద్, తదితరులు

ఆత్మకూర్ (ఎస్) : అర్హులైన గీత కార్మికులకు లైసెన్సులు ఇవ్వాలని కౌండిన్య గౌడ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్ఎన్ ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఇస్తాళాపురం గ్రామంలో నిర్వహించిన గౌడ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కల్లు గీత వృత్తిని ఆదరించాలని, గౌడలకు ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని అన్నారు. అనంతరం గ్రామంలోని కంఠమహేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బీసు మల్లేష్‌గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు బీసు భిక్షం, గోవర్దన్, కప్పల నాగయ్య, గునగంటి మల్సూర్, యాదయ్య, కత్తి రవి, రాములు, దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

భానుపురి : తెలంగాణ ప్రభుత్వం విశ్వకర్మల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ స్వర్ణకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి తొగిటి మురళి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రం సాధించుకుని 8 సంవత్సరాలు గడిచినా విశ్వకర్మలకు ఎలాంటి ప్రయోజనాలు కల్పించలేదని తెలిపారు.

పాస్టర్‌కు సన్మానం


పాస్టర్‌ను సన్మానిస్తున్న క్రైస్తవులు

భానుపురి : పట్టణంలోని చర్చి కాంపౌండ్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ డాక్టర్ ఎం.ప్రభుదాస్ 46 సంవత్సరాల సేవా పరిచర్యను పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ మామిడి శాంసన్ అధ్యక్షతన శుక్రవారం ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి సూర్యాపేట క్రిస్టియన్ మైనారిటీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు స్వరూప శశికాంత్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు సాల్మన్ రాజ్, మీసాల ప్రభుదాస్ జాకబ్, బాబురావు మీసాల గోవర్ధన్, అజార్, వెల్లస్లీ, గాబ్రియేల్, జెవైవీ రమేష్ బాబు, సామ్యూల్ కిరణ్, డేవిడ్ రాజు, లింగనాయక్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

నడిగూడెం : మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10 తరగతి విద్యార్థులకు శుక్రవారం సర్వేజన ఫౌండేషన్ చైర్మన్ బండారు కవిత రూ.20 వేల విలువైన స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యలమర్తి శౌరి, ఉపాధ్యాయులు మోతీలాల్, ఉమాపతి, అశోక్‌గౌడ్, అక్షపతి, ప్రకాష్‌రెడ్డి, ఆర్‌వీఎస్‌రెడ్డి, గోపి తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం డైరీ ఆవిష్కరణ

చిలుకూరు : రైతులకు తక్షణమే రుణమాఫీ అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం చిలుకూరులోని సీపీఐ భవన్‌లో తెలంగాణ రైతు సంఘం డైరీని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. రైతులకు 24 గంటలు కరెంట్ ఇవ్వాలన్నారు. వ్యవసాయానికి విద్యుత్ సక్రమంగా అందకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు కొప్పోజు సూర్యనారాయణ, కంబాల శ్రీను, బొల్లు ప్రసాద్, వాసిరెడ్డి సోమిరెడ్డి, వీరబాబు, రాంశెట్టి కోటయ్య పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

నడిగూడెం : గణతంత్ర దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ టి.నాగేశ్వరరావు, ఎంపీడీఓ యర్రయ్య జిల్లా స్థాయి ఉత్తమ అధికారులుగా పురస్కారాలు అందుకున్నారు. కాగా శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో వారిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, జెడ్పీటీసీ బాణాల కవిత, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటనర్సయ్య, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.జలీల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకే 'కంటి వెలుగు'


నాగారం : డి.కొత్తపల్లిలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శోభారాణి


పెన్‌పహాడ్ : శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

పెన్‌పహాడ్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంతో అంధత్వ సమస్యలు తీరనున్నాయని ఎంపీపీ నెమ్మాది భిక్షం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మాచారం గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉచితంగా కంటి పరీక్షలు, అవసరమైన వారికి అద్దాలు, మందులు ఇవ్వడంతో పాటు ఆపరేషన్లు చేయిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, సర్పంచ్ బొల్లక సైదమ్మబొబ్బయ్య, ఎంపీటీసీ నాగునాయక్, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, వైద్యాధికారి ప్రవంతి, మధు, ఉప సర్పంచ్ నాగయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోవాలి

నాగారం : అంధత్వ నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జి.శోభారాణి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించి మాట్లాడారు. కంటి వెలుగు శిబిరంలో ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కంటి పరీక్షలు నిర్వహించిన అనంతరం ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేస్తారని, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. అనంతరం కంటి వెలుగు శిబిరంలో 127 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 46 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ హర్షవర్ధన్, ఎంపీఓ ధార శ్రీనివాస్, సర్పంచ్ యారాల నర్సింహారెడ్డి, ఆప్టోమెటిస్ట్ డాక్టర్ కె.ఉమ, కార్యదర్శి కొమ్ము అరుణ్, వైద్యసిబ్బంది, ఏఎన్ఎం, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

కళాతపస్వి విశ్వనాథ్‌కు నివాళి


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి : తెలుగు సినిమా దర్శకుడు, కళాతపస్వి కాశీనాధుని విశ్వనాథ్ మరణం తీరనిలోటని సుధా బ్యాంక్ ఎండీ, మనం వికాస వేదిక అధ్యక్షుడు పెద్దిరెడ్డి గణేష్ అన్నారు. శుక్రవారం సుధాబ్యాంక్ ఆవరణలో కె.విశ్వనాథ్ సంస్మరణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. భారతీయ శాస్త్రీయ సంగీతాన్ని పండితుల, పామరుల చెంతకు చేర్చిన గొప్ప దర్శకుడు విశ్వనాథ్ అన్నారు. విశ్వనాథ్ చిత్రాల్లో తెలుగు సంప్రదాయం, సంస్కృతికి పెద్దపీట వేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు అప్పం శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు గుండా రమేష్, తోట శ్యామ్‌ప్రసాద్, రాచకొండ శ్రీనివాస్, హనుమంతరావు, మిర్యాల సుధాకర్, అర్చకులు ఎస్‌సీహెచ్ మురళీధరాచార్యులు, సుధాబ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు సమితి క్యాలెండర్ ఆవిష్కరణ

పెన్‌పహాడ్ : రైతుబంధు సమితి ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంపీపీ నెమ్మాది భిక్షం శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.కృష్ణసందీప్, ఏఈఓ సంధ్య, ఎంపీడీఓ బాణాల శ్రీనివాస్, తూముల ఇంద్రసేనారావు, లక్ష్మీకాంతరావు, నాగునాయక్, రవీందర్ నాయక్, రఫీ, పల్లె సైదులు, తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, తదితరులు

ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న డీఐఈఓ కృష్ణయ్య

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు క్రమశిక్షణతో చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని డీఐఈఓ జానపాటి కృష్ణయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సుమంగళి ఫంక్షన్ హాల్‌లో ప్రతిభ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఐఈఓ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటర్ విద్యార్థులు పరీక్షలు సమీపిస్తున్నందున బాగా చదివి ఉత్తమ ర్యాంకులు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సత్యంబాబు, శ్రీనివాస్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే నాణ్యమైన విద్య

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు డాన్స్‌లు, నృత్యాలతో అలరించారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ రాకేంద్ మాట్లాడారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంపల దావీద్, అధ్యాపకులు జానిపాష, గునగంటి వెంకటేశ్వర్లు, రాజయ్య, దశరథ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు


ఆత్మకూర్ (ఎస్) : నెమ్మికల్లు కళాశాలలో..

సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలి

నడిగూడెం : వరి సాగులో ఎప్పటికప్పుడు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించాలని కోదాడ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు టి.వాసు సూచించారు. శుక్రవారం మండలంలోని కరివిరాలలో వరి సాగులో చీడ పీడలు, ఎరువుల యాజమాన్యంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా యూరియాను తగిన మోతాదులో వేయాలన్నారు. ఎరువులు వేయడం, పురుగు మందుల పిచికారీపై సందేహాలుంటే వ్యవసాయాధికారి, విస్తరణాధికారులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో నడిగూడెం మండల వ్యవసాయాధికారి ఎం.రాజగోపాలరావు, ఏఈఓ రేష్మా, రైతులు, తదితరులు, పాల్గొన్నారు.

అర్హులందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలి

పెన్‌పహాడ్ : అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అన్నారు. శుక్రవారం మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటి స్థలం లేని అర్హులైన పేదలకు 120గజాల ఇంటి స్థలాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు ప్రభుత్వమే ఇచ్చి ఇల్లు నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వృద్ధాప్య, వితంతు పింఛన్లను వెంటనే అందించాలని కోరారు. చీదెళ్ల గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించినా పంపిణీ చేయకపోవడం సరికాదని, తక్షణమే ఇళ్లను పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ పద్మకు వినతి పత్రం అందజేశారు. అందజేశారు. ఈ కార్యక్రమంలో జగపతి, మామిడి సాయి, కిరషన్, పాండు, మంగ్య, కోటయ్య, చిన్ని, నగేష్, వేణు, సైదా, తరును, రమేష్ పాల్గొన్నారు.


పెన్‌పహాడ్ : డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు


నూతనకల్ : నాయబ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

నూతనకల్ : అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ సీపీఎం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నాయబ్ తహసీల్దార్ శ్రీధర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందాల శంకర్‌రెడ్డి మాట్లాడారు. ప్రతి గ్రామంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మించి అర్హులకు కేటాయించాలని అన్నారు. స్థలం లేనివారిని గుర్తించి స్థలాలు కేటాయించాలని కోరారు. స్థలం ఉన్న పేదలు ఇళ్లు నిర్మించుకోవడం కోసం తక్షణమే ఆర్థికసాయం అందించాలని అన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని నాయబ్ తహసీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అందెపల్లి లక్ష్మయ్య, బొజ్జ శ్రీను, కందాల కృష్ణారెడ్డి, బాలగాని సోమయ్య, మందడి చంద్రారెడ్డి, ఎర్ర ఉప్పల్ రెడ్డి, ఇరుగు రమేష్, బొజ్జ విజయ్, బత్తుల తిరుమలేష్, జటంగి లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆత్మకూర్ (ఎస్) : రైతులు పంట మార్పిడి చేస్తే చీడ పీడలు తగ్గి దిగుబడులు పెరుగుతాయని మండల వ్యవసాయాధికారిణి దివ్య అన్నారు. మండల పరిధిలో రైతులు సాగు చేసిన వేరుశెనగ పంటలను శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించి మాట్లాడారు. ఒక భూమిలో ఒకే పంట కాకుండా పంట మార్పిడి చేయాలన్నారు. వేసవిలో ఆరుతడి పంటలైన వేరుశెనగ, అలసంద, మినుములు సాగు చేస్తే మంచి లాభాలు పొందవచ్చని సూచించారు. అంతకు ముందు మండల కేంద్రంలోని రైతు వేదికలో వేసవి పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి శైలజ, రైతులు కసగాని మల్సూర్, సుదిరెడ్డి శేఖర్‌రెడ్డి, కసగాని లింగయ్య, మిర్యాల లింగారెడ్డి, ఉప్పుల పిచ్చయ్య, బట్టిపెల్లి వినోద్, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అధ్యయనోత్సవాలు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అధ్యయనోత్సవాలు జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పల్లకిలో ఆళ్వార్లు, దేవరాజ వాహనంపై నర్సింహస్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ఉంచి ఆలయంలోని నాలుగు మాడ వీధుల్లో మూడుసార్లు ప్రదక్షిణలు చేశారు. అధ్యాపకులచే అధ్యయనోత్సవ కార్యక్రమాలు జరిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు విఖనసలక్ష్మీనర్సింహాచార్యులు, రాంబాబుఅయ్యంగార్, యోగానందదీక్షితులు, పవన్‌కుమార్, స్థానాచార్యులు జియర్ వెంకటనర్సింహాచార్యులు, భరతాచార్యులు, నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.


స్వామి, ఆళ్వార్ల విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

నేడు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చలో అసెంబ్లీ

దురాజ్‌పల్లి : రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 30% నిధులు కేటాయించాలని కోరుతూ నేడు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో చేపడుతున్న చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పుల్లూరి సింహాద్రి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020 న్యూ ఎడ్యుకేషన్ పాలసీ, నూతన జాతీయ విద్యా విధానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 4న అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తే అక్రమంగా పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్‌ను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఆయనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు జీవన్, నవీన్, పరశురాం, మహేష్, పవన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పుల్లూరి సింహాద్రి

ముమ్మరంగా కంటి పరీక్షలు

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 2వ విడత కంటి వెలుగు కార్యక్రమం ఆయా గ్రామాల్లో ముమ్మరంగా కొనసాగుతోంది. తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 2వ, 3వ వార్డుల్లో, తొండ గ్రామంలో ఈ నెల 19 నుంచి కంటి వెలుగు వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నారు. ఈ వార్డులు, గ్రామ పరిధిలో వైద్యసిబ్బంది ఇప్పటి వరకు 2529 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి దాదాపు 900మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమున్న వారికి వెంటనే కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా వైద్యసిబ్బంది కంటి పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. గతంలో తలెత్తిన ఇబ్బందులను అధిగమించేందుకు కంటి వెలుగుకు ఆధార్ కార్డు లింక్ చేశారు. లబ్ధిదారుల ఆధార్ కార్డు వివరాలను నమోదు చేసుకున్న తరువాతనే కంటిపరీక్షలు చేపడుతున్నారు.


కంటి వెలుగు శిబిరంలో లబ్ధిదారుల ఆధార్ వివరాలు నమోదు చేసుకుంటున్న సిబ్బంది

కంటి పరీక్ష చేయించుకున్న

కళ్లు కొంచెం మసకగా కనబడుతుండటంతో పరీక్ష చేయించుకున్నా. కంటి వెలుగు శిబిరంలో వైద్యసిబ్బంది ఉచితంగా పరీక్షలు చేసి కంటి అద్దాలు ఇచ్చారు. అద్దాలు పెట్టుకుంటే కళ్లు మంచిగా కనిపిస్తున్నాయి.

- శ్రీనివాస్, తిరుమలగిరి

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకోవాలి. వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి వృద్ధులు, మహిళలను వైద్య పరీక్షలకు తీసుకొస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత కంటి పరీక్షల అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

- మల్లెల వందన, వైద్యాధికారి, తిరుమలగిరి

రూ.25 వేల విరాళం

నడిగూడెం : నడిగూగెం మండల కేంద్రంలోని శ్రీ షిర్డీ సాయి మందిరంలో భోజనశాల నిర్మాణానికి శుక్రవారం మండల కేంద్రానికి చెందిన చింతలపాటి నర్సింహారావు, ప్రమీల దంపతులు ఇరవై ఐదు వేల రూపాయలను ఆలయ కమిటీ సభ్యులకు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మండవ వెంకటేశ్వరరావు, కార్యదర్శి అనంతుల కృష్ణయ్య, బి.మహేష్, బి.ఉపేందర్, ఆలయ పూజారి రాజశేఖర్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న కల్లెట్లపల్లి ఉప్పలయ్య

నాగారం : సీఎం సహాయనిధిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య అన్నారు. పస్తాల గ్రామానికి చెందిన ఆడెపు కొరమయ్యకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.60,000 సీఎంఆర్ఎఫ్ చెక్కును మండల పరిధిలోని ఫణిగిరిలో శుక్రవారం పంపిణీ చేసి మాట్లాడారు. పేద ప్రజలకు సీఎం సహాయనిధి అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పస్తాల ఉపసర్పంచ్ చిత్తలూరి రమేష్, జిల్లా మధు, రాచకొండ అంజయ్య, మొగలగాని అనిల్, వడ్లకొండ రాములు, వీరస్వామి పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శి సోమిరెడ్డి మృతి


సోమిరెడ్డి (ఫైల్)

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం సీపీఐ మండల కార్యదర్శి వాసిరెడ్డి సోమిరెడ్డి (68) శుక్రవారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. సోమిరెడ్డి గత 40 ఏళ్లుగా కమ్యూనిస్టు పార్టీలో పని చేస్తూ పేదల పక్షాన పోరాడారు. అతడి మృతదేహాన్ని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, యాదగిరిరావు, ఎల్లంల యాదగిరి, కడెం లింగయ్య, కొత్తగట్టు మల్లయ్య, వివిధ పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

సోమిరెడ్డి మృతి తీరని లోటు

నూతనకల్ : సీపీఐ సీనియర్ నాయకుడు, తిరుమలగిరి మండల కార్యదర్శి వాసిరెడ్డి సోమిరెడ్డి మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్, సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వేర్వేరుగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిన్నతనం నుంచే భూస్వామ్య పెత్తందార్లకు వ్యతిరేకంగా వామపక్ష పార్టీల్లో పనిచేశారని గుర్తుచేశారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి ముగ్గుల పోటీలు

మునగాల : మండలంలోని బరాఖత్‌గూడెం శివారులో గల శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ కల్యాణ మహోత్సవం సందర్భంగా ఈనెల 5 నుంచి రాష్ట్ర స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు గోగుల సతీష్ మెమోరియల్ ట్రస్టు సభ్యుడు రాయి వీరబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు మొదటి, రెండవ, మూడవ, నాలుగవ, ఐదవ బహుమతుల కింద వరుసగా రూ.5,016, రూ.3,016, రూ.2,016, రూ.1,016, రూ.816ల నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే మహిళలు ఎంట్రీ ఫీజు రూ.100 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్.99496 24066 నంబర్‌ను సంప్రదించాలని నిర్వాహకులు పేర్కొన్నారు.

జానకీనగర్‌లో పశువైద్య శిబిరం

చిలుకూరు : మండలంలోని జానకీనగర్ గ్రామంలో చిలుకూరు పశువైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరాన్ని శుక్రవారం సర్పంచ్ బాణోతు పంతులు, ఎంపీటీసీ బాణోతు కృష్ణచైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా 62 పశువులకు ఉచిత వైద్యం అందించి మందులు అందజేసినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి వీరారెడ్డి, సిబ్బంది వీరబాబు, తరుణ్, గోపాలమిత్రలు వెంకటేశ్వర్లు, అశోక్, రమేష్, నరసింహారావు, రైతులు పాల్గొన్నారు.